క్లుప్తంగా

మహాశివరాత్రి శుభాకాంక్షలు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు అందరూ పండగను బాగా నిర్వహించుకోవాలని, కోటప్పకొండ త్రికోటేశ్వరుని సన్నిధిలో తిరునాళ్ల విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని కోరారు. తిరునాళ్లకు వెళ్లే భక్తులు తమ కుటుంబ సభ్యులతో కోటప్పకొండకు వెళ్లి త్రికోటేశ్వరుడిని దర్శనం చేసుకొని క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కోరారు. ప్రభ నిర్వాహకులతోపాటు అందరూ క్షేమంగా కొండకు వెళ్లి త్రికోటేశ్వరుని ఆశీర్వచనాలు పొందాలని తాను కోరుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



యడ్లపాడు: ఉన్నవ జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని బోయపాలెం గ్రామానికి చెందిన స్వర్గీయ బద్దుల బ్రహ్మయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అందజేశారు. దాత సుబ్బారావు మాట్లాడుతూ తన కుమారుడు జ్ఞాపకార్థం విద్యాసామగ్రి అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధురి, బద్దుల పార్థు, వి.శ్రీనివాసనాయక్, పఠాన్ అల్లావుద్దీన్, కె.హరీష్, వెంకటేశ్వరనాయక్, నాగేశ్వరనాయక్, కె.రవి, కామినేని సుబ్బారావు, నాగశంకరం పాల్గొన్నారు.

రన్నింగ్ ట్రాక్‌కు విరాళం

వినుకొండ : నాగులవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. పాఠశాల గ్రౌండ్‌లో రన్నింగ్ ట్రాక్ కోసం సంతమాగులూరు బాలాజీ స్కూల్ ప్రిన్సిపాల్ రాము రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. అలాగే ఎస్ఐసీ రమణారెడ్డి రూ.20 వేలు, ప్రశాంత్ రూ.15 వేలు విరాళం ప్రకటించారు. దాతలను పాఠశాల హెచ్‌ఎం షణ్మోహనరావు సత్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కోటప్పకొండ తిరునాళ్లకు నరసరావుపేట ముస్తాబు



నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు వెళ్లే లక్షలాదిమంది భక్తులకోసం పట్టణం ముస్తాబైంది. పురపాలకసంఘం ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు భక్తుల కోసం రూ.39 లక్షలతో ఏర్పాట్లు చేశారు. చిలకలూరిపేట రోడ్డులోని ఆర్వోబీలపై ఉన్న పూలకుండీలకు పెయింటింగ్‌లు వేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న శివునిబొమ్మ ఐలాండ్‌కు రంగులు వేసి పూలతో అలంకరించారు. పలువురు భక్తులు శివుని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. భక్తుల కోసం పది ప్రదేశాల్లో తాత్కాలిక మంచి నీటి చలివేంద్రాలు, మరో నాలుగు ప్రదేశాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొండకు వెళ్లే భక్తుల కోసం నాలుగు టికెట్ కౌంటర్లను బారికేడ్లతో ఏర్పాటు చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును వివరణ కోరగా ప్రభల రాకపోకలకు అడ్డంగా ఉండే హోర్డింగ్‌లను తొలగించాలని నోటీసులు అందజేశామని, భక్తుల సౌకర్యాల కోసం రూ.39లక్షలతో ఏర్పాట్లు చేశామని, ప్రభలు వెళ్లే మార్గాన్ని శుభ్రం చేయించి అవరోధాలను తొలగించామని, సెంట్రల్ డివైడర్లకు లైటింగ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కోటప్పకొండ వద్ద పారిశుద్ధ్య నిర్వాహణకు పురపాలకసంఘానికి చెందిన 20మందిని ప్రత్యేకంగా పంపామన్నారు. ఇదిలా ఉంటే వినుకొండ నుంచీ పారిశుద్ధ్య సిబ్బంది కోటప్పకొండకు వెళ్లారని వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు.

నకిలీ వికారం

- బొల్లాపల్లి మండలంలో మిర్చి రైతుల ఆక్రందన
- శాస్త్రవేత్తల పరిశీలనతో సరి!
- నకిలీ విత్తన కంపెనీలపై చర్యలేవీ!
- న్యాయం చేయాలని రైతుల వేడుకోలు



గరికపాడులో పంటను పరిశీలిస్తున్న లాంఫాం శాస్త్రవేత్త, అధికారులు తదితరులు



గంగుపల్లిలో నకిలీ మిరపవిత్తన పంట

బొల్లాపల్లి : నకిలీ విత్తనాలు ఒక వైపు... గిట్టుబాటు ధర లేక మరో వైపు మిరప రైతులు విలవిలలాడుతున్నారు. ఈ ఏడాది నకిలీ విత్తన సాగు వల్ల నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటా నియోజకవర్గంలో ఏదో ఒక ప్రాంతంలో నకిలీ విత్తనాల సమస్య వేధిస్తూనే ఉంది. మండలంలోని గరికపాడు, రేమిడిచర్ల, గంగుపల్లి, గుట్లపల్లి, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని కొన్ని గ్రామాల రైతులు ఈ ఏడాది నకిలీ విత్తన సాగుతో నట్టేట మునిగారు. ఈ విషయాన్ని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారికి న్యాయం జరగలేదు. వ్యవసాయ శాఖ అధికారులు పంటను పరిశీలించి అనంతరం లాంఫాం సైంటిస్ట్‌లకు నిర్ధారణ కోసం సిఫార్సు చేశారు. ఈనెల 7న లాంఫాం సీనియర్ శాస్త్రవేత్త ఎ.రజని గ్రామాల్లో నకిలీ మిరప విత్తనాల ద్వారా సాగు చేసిన పంటలను పరిశీలించి నమూనాలు సేకరించారు. శాస్త్రవేత్తల నివేదిక రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో నకిలీ విత్తన కంపెనీలు పుట్టుగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అధికారులు వాటిని నియంత్రించలేకపోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వెల్‌కమ్, ఆగ్రోస్, శ్రీకర్షక కంపెనీల విత్తనాల వల్ల నష్టపోయినట్టు చాలామంది రైతులు చెబుతున్నారు. ప్రజాసమస్యల ఫిర్యాదు వేదికలో నకిలీ విత్తన కంపెనీలపై ఫిర్యాదుచేశారు. ఈ విషయంపై వినుకొండ ఏడీఏ బి.రవిబాబు, ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ మాట్లాడుతూ లాంఫాం సైంటిస్ట్ ఎ.రజని మిరప పంట నివేదికను అందజేశారని, ఈ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, కంపెనీలపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. రైతులు విత్తన ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమతి లేని షాపుల్లో కొనుగోలు చేయకకూడదని, ఏదైనా అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

వెల్‌కమ్ కంపెనీకి చెందిన తేజ రకం దిగుబడి బాగా వస్తుందంటే నాలుగు ఎకరాల్లో సాగు చేశా. ఇప్పటివరకు ఎకరాకు రూ.2.50 లక్షల వంతున పెట్టుబడి పెట్టాను. అనుకున్న దిగుబడి రాకపోవడంతో కాపు సరిగా కాయలేదు. అధికార యంత్రాంగం ఆదుకోవాలి.

– అమరేసు చిన్నబ్రహ్మయ్య, మిర్చి రైతు, గరికపాడు

మోసపోయాం



నకిలీ విత్తనాలతో మోసపోయాం. ఆర్థికంగా నష్టపోయాం. రెండు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. రూ.2లక్షలు పెట్టుబడి పెట్టాం. కోత కోసినా ప్రయోజనం లేదు. తాలు కాయలే వచ్చాయి. ఇదే రకం విత్తనాలు ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలంలో కొంతమంది రైతులు సాగు చేశారు. వారు కూడా నష్టపోయారు. నకిలీ విత్తనాలతో పంట సాగు చేసిన రైతులను ఆదుకోండి.

– వెంకట్రావు, రైతు, గంగుపల్లి

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడి అంతిమ యాత్ర



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కురుగంటి పిచ్చిరెడ్డి అంతిమ యాత్రను మంగళవారం నిర్వహించారు. ఆయన అంతిమ యాత్రలో మాజీ శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అంతిమ యాత్రలో డాక్టర్ గోపిరెడ్డి ట్రాక్టర్ నడిపారు. వందలాది మంది శిష్యబృందం విశ్రాంత ఉపాధ్యాయునికి నివాళి అర్పించారు. జోహార్ అంటూ నినదించారు. ఆయన కుమారుడు కురుగంటి శ్రీనివాసరెడ్డిని పరామర్శించారు.

సృజనాత్మకత వెలికితీతకు సైన్స్ ప్రదర్శనలు దోహదం



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయని కేర్ పాఠశాల ప్రిన్సిపల్ గండికోట అనంతకోటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పరిశోధనల పట్ల అవగాహన కలిగించాలని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే వస్తు సేవల నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సోలార్ సిస్టమ్, ఇంకుడు గుంతలు, నీటి సంరక్షణ, మానవ శరీర నిర్మాణం, తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణం వంటి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు బి.సురేష్, యు.లక్ష్మి, టి.సత్యనారాయణ, కె.సునీత తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేట పురుషోత్తపట్నం నుంచి మంగళవారం ప్రభలు కోటప్పకొండకు తరలాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విడదల రజని ప్రభలకు ప్రత్యేక పూజలు చేశారు. ఓ ప్రభకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను కొంతసేపు నడిపి ప్రజల్లో ఉత్సాహం నింపారు.

– చిలకలూరిపేట

చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

నూజెండ్ల : చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని ఏపీ బాలల పరిక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. నూజెండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిది రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. పద్మావతి మాట్లాడుతూ బాలల సంరక్షణలో అంగన్‌వాడీలు ముఖ్య భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ముదివర్తి అనురాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇన్నాసమ్మ, నాగరాజకుమారి పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల నుంచి నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఎంఈఓ పుసులూరి లలితకుమారి, కోర్సు డైరెక్టరు బొడ్డపాటి విజయలక్ష్మి, రీసోర్స్ పర్సన్లు బిళ్ళా రాజారమేష్, యం. శ్రీనివాసరావు, ప్రవీణ్, రవి, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి, పార్వతి పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో..

బొల్లాపల్లి : ప్రాథమిక విద్య శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈపూరు ప్రాజెక్టు పరిధిలోని ఈపూరు, బొల్లాపల్లి మండల కేంద్రాల్లోని జడ్పీహైస్కూల్స్, మోడల్ స్కూల్లో ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. కోర్సు డైరెక్టర్‌గా ఎంఈవో-2 కె.పార్వతి నిర్వహించారు. రిసోర్సు పర్సన్స్‌గా ఈపూరు ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణతోపాటు సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు వ్యవహరించారు.

ముగిసిన అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ

వినుకొండ: పట్టణంలోని ఏపీ ట్రైబర్ వెల్ఫేర్ గరల్స్ స్కూల్‌లొఓ 120 రోజుల అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా పాల్గొని అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనర్స్ సూపర్‌వైజర్ శ్రీలత, షీలా, దివ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

200 ఏళ్లుగా.. భక్తి'ప్రభ'త్తులతో..



కోటప్పకొండ తిరనాళ్లకు పొట్లూరు గ్రామ వాసులు భక్తి ప్రపత్తులతో రెండు వందల ఏళ్లుగా ప్రభను తీసుకెళ్తున్నారు. బ్రిటిష్ కాలంలో పొలాల వివాదం కారణంగా కోర్టు కేసు కొన్నేళ్లపాటు నడవడంతో ఆ కేసు గెలిస్తే కోటయ్యస్వామికి ప్రభ కడతామని గ్రామస్తులు మొక్కుకున్నారు. కోరుకున్నట్టే కేసు గెలుపొందడంతో అప్పటి నుంచి ఏటా వంతులవారీగా ప్రభ కట్టి కోటప్పకొండకు తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి విద్యుత్ ప్రభను గ్రామంలో ఊరేగించారు. మహాశివరాత్రికి కోటప్పకొండ తరలించనున్నారు.

– శావల్యాపురం

పోలింగ్ కేంద్రాల పరిశీలన



యడ్లపాడు లూథరన్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు వాకాటి అరుణ

యడ్లపాడు: పట్టభద్రుల ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులదే అని కృష్ణా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు వాకాటి అరుణ చెప్పారు. మంగళవారం మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలలో ఉన్న 380, 381 నంబర్ల పోలింగ్ కేంద్రాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యడ్లపాడు మండలం పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ బూత్‌లు రెండు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈరెండు బూత్‌ల పరిధిలో మొత్తం 1,085 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా, వీరిలో 693 మంది పురుషులు, 392 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నట్లు వెల్లడించారు. ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు అన్ని వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్వో జెట్టి విజయశ్రీ, సూపర్‌వైజర్‌లు ఎంపీడీవో వి హేమలతాదేవి, షేక్ జాకీర్‌హుస్సేన్, బీఎల్‌వోలు కేపీ చారి, షేక్ రఫీల్లా ఉన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు

నాదెండ్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏఈఆర్వో, తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 27న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రెండు పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ స్వరూపరాణి, స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ రెండు కేంద్రాల్లో 1614 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని వివరించారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరగనుందని పేర్కొన్నారు. ఆయా కేంద్రాల వద్ద భద్రతకై పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

నూజెండ్లలో..

నూజెండ్ల: ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

బొప్పూడి జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం

చిలకలూరిపేటటౌన్: విద్యార్థి దశలో పదో తరగతి భవిష్యత్తుకు పునాది వంటిదని, వ్యక్తి ప్రవర్తనకు, క్రమశిక్షణకు అది కీలకమైందని సీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తోటకూర నారాయణ చెప్పారు. మండలంలోని బొప్పూడి ఎస్‌పీఎస్‌జీవీ జెడ్పీహైస్కూల్ వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా నారాయణ పాల్గొని పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

టెన్త్ విద్యార్థుల ఫేర్‌వెల్

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం జరిగింది. గణపవరం, చిలకలూరిపేట బ్యాంక్ ఆఫ్ బరోడా అందించిన విద్యాసామగ్రిని 154 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఎస్‌ఎంకే జెడ్పీ హైస్కూల్లో..

చిలకలూరిపేట: పసుమర్రు ఎస్‌ఎంకే జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమంతో పాటు పూర్వ విద్యార్థి షేక్ సుభాని సహకారంతో విద్యాసామగ్రి పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.హనుమంతరావు పాల్గొన్నారు.